ప్రజాశక్తి
శుక్రవారం 15 సెప్టెంబర్ 2023 5
శ్రీ సత్యసాయి

సమస్యను కమిషనర్‌కు వివరిస్తున్న సిఐటియు నాయకులు రాము

తాగునీటి సమస్యను పరిష్కరించండి

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని మోడల్ కాలనీలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సిఐటియు నాయకులు రాము ఆధ్వర్యంలో ఆ ప్రాంత మహిళలు ఖాళీ బిందెలతో స్థానిక మున్సిపల్ కమిషనర్ ఛాంబర్ ముందు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతు తాగునీటి కనెక్షన్ కోసం కాలనీకి చెందిన 30 మంది చెరో రూ.10వేల ప్రకారం డిపాజిట్‌ను పురపాలక సంఘానికి చెల్లించారన్నారు. అయితే ఇప్పటి వరకు వారికి నీటి కోళాయి కనెక్షన్ ఇవ్వలేదన్నారు. వెంటనే డిపాజిట్ చెల్లించిన వారందరికి కొళాయి కనెక్షన్ ఇవ్వాలన్నారు. అనంతరంకమిషనర్ ప్రమోద్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. స్పందించిన కమిషనర్ పరిశీలన చేసి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

ఇళ్ల స్థలాల కోసం పోరుబాట

◆ సిపిఎం ఆధ్వర్యంలో కదిలిన పేదలదండు
◆ చిలమత్తూరులో భూస్వాధీన ఉద్యమం
◆ ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకుని నిరసన

ప్రజాశక్తి-చిలమత్తూరు

ఇళ్ల స్థలాల కోసం పేదలు పోరుబాట పట్టారు. ఏళ్ల తరబడి స్థలాల కోసం అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇచ్చినా స్పందన లేకపోవడంతో సిపిఎం ఆధ్వర్యంలో భూస్వాధీన పోరాటం నిర్వహించారు. చిలమత్తూరు మండలం కోడూరు రెవెన్యూ పొలం సర్వే నెంబర్ 805లో గురువారం ఉదయం గుడిసెలు వేసుకుని ఆందోళన నిర్వహించారు. గత మూడు సంవత్సరాలుగా కోర్టు కేసు పేరుతో అధికారులు ఇళ్ల పట్టాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పేదల పక్షాన సిపిఎం నిలబడింది. గురువారం నాడు పేదలతో కలిసి సిపిఎం నాయకులు కోడూరు రెవెన్యూ పొలం 805లోకి వెళ్లి ఎర్రజెండాలు పాతారు. తక్షణం ఈ భూమిని పేదలకు పంచాలంటూ అక్కడే గుడిసెలు వేసుకుని నిరసన తెలిపారు. ఈ పోరాటంలో పాల్గొన్న సిపిఎం రాష్ట్ర నాయకులు జి.ఓబులు మాట్లాడుతూ చిలమత్తూరు మండల పరిధిలో దాదాపు 250 మందికి కోడూరు వద్ద ముద్దప్పల్లి సమీపంలో ఇళ్ల స్థలాలను కేటాయించారన్నారు. అంతకు ముందు కొడికొండ చెక్‌పోస్టు వద్ద స్థలాన్ని కేటాయించిందన్నారు. తర్వాత లాలేపల్లి క్రాస్ వద్ద 805 సర్వే నెంబర్‌లో స్థలాలు ఇస్తామని చెప్పారన్నారు. ఈ స్థలాలు అన్నీ విలువైనవన్న భావనతో ప్రతిసారీ వాటిని రద్దు చేయడం, కొత్తవాటిని ఇస్తామని చెప్పడం పరిపాటిగా మారిందన్నారు. పేదలకు విలువైన ప్రదేశంలో ఇళ్ల స్థలాలు ఇవ్వకూడదని ఏ చట్టం చెప్పిందో రెవెన్యూ అధికారులు చెప్పాలన్నారు. పేదలపై ప్రభుత్వం, అధికార యంత్రాంగం ఈ రకంగా వ్యవహరించడం సిగ్గు చేటన్నారు. ప్రభుత్వం, అధికార యంత్రాంగం అర్హులను గుర్తించిన తర్వాత వారికి ఇళ్ల పట్టాలను ఇవ్వకపోవడం దుర్మార్గం అన్నారు. మూడు సంవత్సరాలుగా కోర్టుల పేరుతో కాలక్షేపం చేయడం దారుణం అన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేంత వరకు ఉద్యమాన్ని ఆపేది లేదని స్పష్టం చేశారు.

భూ పోరాటంలో పేదలతో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర నాయకులు జి.ఓబులు

భూస్వాధీనం పోరాటంలో భాగంగా చిన్నారితో కలిసి గుడిసె వేసుకుని అక్కడే తల్లి

అధికారులపై ఆగ్రహం

ఆందోళన నిర్వహిస్తున్న ప్రాంతానికి తహశీల్దార్ నాగరాజు, ఎస్ఐ శ్రీనివాసులు సిబ్బంది చేరుకున్నారు. పేదలు, సిపిఎం నాయకులతో మాట్లాడారు. స్థలం వివాదం కోర్టులో ఉన్నందన్నారు. ఈ సమస్య పరిష్కారం కాగానే ముద్దప్పల్లి వద్దే స్థలాలను ఇస్తామని చెప్పారు. కోర్టు సమస్యల పేరుతో ఇంకెంతకాలం తమను మోసం చేస్తారంటూ పేదలు అధికారులను నిలదీశారు. పేదలకు విలువైన స్థలంలో ఎందుకు పట్టాలు ఇవ్వకూడదో చెప్పాలని ప్రశ్నించారు. పేదలు ఎంత చెప్పినా వినకపోవడంతో అధికారులు అక్కడి నుంచి వెనుదిరిగారు. అధికారులు వెళ్లిన అనంతరం కూడా సిపిఎం నాయకులు, పేదలు ఆ స్థలంలోనే ఉన్నారు. అక్కడే వంటావార్పు కార్యక్రమం చేపట్టారు. చిన్నారులతో పాటు గుడిసెలు వేసుకుని ఆ ప్రాంతంలోనే ఉన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఫిరంగి ప్రవీణ్ కుమార్, వెంకటేష్, నల్ల లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

హిందీ దివస్ సందర్భంగా విద్యార్థులు గీచిన చిత్రం

ఘనంగా హిందీ దివస్

ప్రజాశక్తి-రొద్దం

మండల పరిధిలోని కోగిర జడ్పి హైస్కూల్‌లో గురువారం హిందీ ఉపాధ్యాయుడు జాబిలి చాంద్‌బాషా ఆధ్వర్యంలో హిందీ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు హిందీలో ఉపన్యసించి, కథలు చెప్పి, బాల గేయాలు, పాటలు పాడుతూ ఉల్లా సంగా ఉత్సాహంగా పాల్గొన్నారు. హెచ్‌ఎం నారాయణరెడ్డి మాట్లాడుతూ హిందీ కేవలం భాష కాదు, భారతీయుల హృదయ స్పందన అన్నారు. మన ఆత్మగౌరవం, సనాతన సంస్కా ర సాఫల్యాలకు ప్రతిబింబం అన్నారు. చాంద్‌బాషా మాట్లాడుతూ హిందీ జాతీయ భాషగా, రాజభాషగా, అంతర్జాతీయ భాషగా గుర్తింపు పొందిందన్నారు. హిందీ మాట్లాడే వారి సంఖ్య ఇంగ్లిష్, చైనీస్ తర్వాత మూడోస్థానంలో ఉందన్నారు. సానిపల్లి ఎంపియుపి పాఠశాలలో హెచ్‌ఎం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నారాయణస్వామి, మోహన్‌రెడ్డి, కృష్ణానాయక్, లక్ష్మి, నరసమ్మ, లక్ష్మినారాయణ, సత్యమయ్య, మహబూబ్‌బాషా, కోగిర పాఠశాల ఉపాధ్యాయులు వెంకటేశు లు, పోతులయ్య, హసీన, బాను, శివయ్య, రమేష్, రామంజి, ఆదినారాయణ, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న యుటిఎఫ్ నాయకులు

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు సన్మానం

మడకశిర : జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన మండల పరిధిలోని గుర్రప్పకొండ ఆదర్శ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ఎంకె.సత్యనారాయణరావు, హరేసముద్రం ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయురా లు గిరిజాకుమారిని గురువారం తాలూకా యుటిఎఫ్ ఆధ్వర్యంలో పూలమాల లు, దుశ్శాలువాతో ఘనంగా సన్మానించా రు. యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షు లు కె.భూతన్న, మండల ప్రధాన కార్యదర్శులు మాలింగప్ప, మూడ్ల గిరియప్ప మాట్లాడుతూ కృషి, పట్టుదల, అంకితభావం, చైతన్య స్ఫూర్తితో బోధన చేసి విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో గిరిజాకుమారి, ఎంకె.సత్య నారాయణరావు సఫలీకృతుల య్యారని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో యుటిఎఫ్ ఉపాధ్యక్షులు జోగప్ప, గుడిబండ మండల అధ్యక్షులు నరసింహప్ప, కోశాధికారి బి.ఈశ్వ రప్ప, సుదర్శన్, సీనియర్ డిస్ట్రిక్ట్ కౌన్సిలర్ ఓబన్న, సిబ్బంది గోవిందనాయక్, రంగనాథ్, శ్రీరాములు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

హిందూపురం : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా వైసిపి ప్రభుత్వం పని చేస్తోందని నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి దీపిక పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డులో గురువారం చేపట్టిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆమె ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు షాజియా, మహిళా అధ్యక్షురాలు నాగమణి, వార్డు ఇన్‌ఛార్జులు కవిత, నాగరాజు, డిష్ చాంద్‌బాషా, తిమ్మారెడ్డి, శివన్న, కవితారెడ్డి, కురుబ భారతి, కృష్ణగౌడ్, జేమ్స్ బ్రదర్, శివరామిరెడ్డి, కురుబ ఆదినారాయణప్ప, వార్డు సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ విత్తనాల కోసం ఎదురుచూపు

అగళి : సత్యసాయి జిల్లాలోని మారుమూల మండలమైన అగళిలో రైతులు ప్రత్యామ్నాయ విత్తనాల కోసం ఎదురుచూస్తున్నారు. ఈ ప్రాంతంలో ఖరీఫ్ సీజన్ చివర్లో చాలా మంది రైతులు రాగి, ఉలువ పంటలు సాగు చేసేందుకు ఆసక్తిగా ఉన్నారు. అయితే విత్తనాలు అందుబాటులో లేకపోవడంతో భూములను బీడు పెట్టారు. మరోవైపు వ్యవసాయ అధికారులు సబ్సిడీతో ఉలువలు పంపిణీ పంపిణీ చేస్తామని పేర్కొంటుండడంతో రైతులు నెల రోజుల నుంచి వ్యవసాయ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. వారం రోజుల నుంచి చాలా మండలాల్లో రైతులకు సబ్సిడీపై రాగులు, ఉలువలు పంపిణీ చేశారు. ఈ విషయమై గురువారం వ్యవసాయ అధికారులను సంప్రదించగా అగళి మండలానికి ఇంతవరకూ స్టాకు రాలేదని చెప్పడంతో రైతులు నిరాశగా వెనుదిరిగారు. మండల వ్యవసాయ అధికారులు వెంటనే ఉలువలు తెప్పించి పంపిణీ చేయాలని మండల రైతులు కోరుతున్నారు.

సమస్యకు పరిష్కారం..!

◆ విద్యార్థిని వద్దకు పరుగులు తీసిన అధికారులు
◆ కదిలించిన ప్రజాశక్తి కథనం

ప్రజాశక్తి-చిలమత్తూరు

"బతికుండగానే చంపేశారు" అనే శీర్షికన గురువారం నాడు ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితం అయిన కథనంపై అధికార యంత్రాంగం కదిలింది. బతికుండగానే ఓ విద్యార్థినిని ఆన్‌లైన్‌లో చనిపోయినట్లు నమోదు చేయడం, దీని వల్ల విద్యార్థిని ఇంటర్ విద్యకు దూరం అయ్యే ప్రమాదంపై ప్రజాశక్తిలో పూర్తి స్థాయి కథనం ప్రచురితం అయ్యింది. గురువారం ఉదయం ఎంపిడిఒ నరేంద్రకృష్ణ దీనిపై స్పందించారు. సిబ్బందితో కలిసి బాధిత విద్యార్థిని కౌసర్ ఇంటి వద్దకెళ్లారు. ఆమెతో మాట్లాడి సమస్యను తెలుసు కున్నారు. ఏళ్ల తరబడి పరిష్కారం కాని సమస్యను ఒక్కరోజులో పరిష్కరించేలా చర్యలకు ఉపక్రమించారు. సమస్యను జిల్లా టెక్నికల్ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లి వారితో మాట్లాడారు. ఏఈపీడీఎస్ లో జరిగిన లోపాన్ని సరిచేసేందుకు అవసరం అయ్యే చర్యలు చేపట్టారు. వారి తల్లిదండ్రుల రేషన్‌కార్డులో అప్పటికప్పుడే విద్యార్థిని కౌసర్ పేరును చేర్పించారు. ఇంటర్ కళాశాల అడ్మిషన్‌ను పరిశీలించగా అందులో అడ్మిషన్‌కు అర్హత ఉన్నట్లు తేలింది. అయితే ఇంటర్ ప్రవేశానికి సమయం ముగియడంతో ఆర్ఐఒతో మాట్లాడి అడ్మిషన్ చేయించేలా ఒప్పించారు. విద్యార్థిని చదువుకునే సమయంలో ప్రభుత్వం ద్వారా అందించే అన్ని పథకాలు వర్తించేలా ఏర్పాటు చేస్తామని ఎంపిడిఒ ఆ కుటుంబానికి భరోసా ఇచ్చారు. మూడేళ్ల పాటు పరిష్కారం కాని సమస్యను వెలుగులోకి తెచ్చి విద్యార్థినికి న్యాయం చేయడంలో ప్రజాశక్తి చూపిన చొరవను పలువురు అభినందించారు. సమస్యను వెలుగులోకి తెచ్చిన ప్రజాశక్తికి ఎంపిడిఒ, విద్యార్థిని కుటుంబ సభ్యులు, ప్రజాసంఘాల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థిని పేరును ఆన్‌లైన్ ద్వారా రేషన్‌కార్డులో చేరుస్తున్న అధికారులు

ప్రజాశక్తి
గురువారం 14 సెప్టెంబర్ 2023 5
శ్రీ సత్యసాయి
బతికుండగానే చంపేశారు..!

విద్యార్థిని సమస్యపై గురువారం నాడు ప్రజాశక్తిలో ప్రచురితం అయిన కథనం

చలో ఢిల్లీ గోడపత్రికలను విడుదల చేస్తున్న దీపికవేణురెడ్డి

హక్కుల సాధనకు ఏకం కండి

ప్రజాశక్తి-హిందూపురం

హక్కుల సాధన కోసం బిసిలందరూ ఐక్యంగా ముందుకు రావాలని వైసిపి ఇన్‌ఛార్జి దీపిక పిలుపునిచ్చారు. బిసి సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 21, 22 తేదీల్లో చేపట్టిన చలో ఢిల్లీ గోడ పత్రికలను గురువారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఆవిష్కరించా రు. ఈ సందర్భంగా దీపిక మాట్లాడుతూ ప్రస్తుతం జరిగే పార్లమెంట్ సమావేశాల్లో బిసి బిల్లును, మహిళా బిల్లును ప్రవేశపెట్టాలన్నారు. చట్ట సభల్లో సైతం మహిళలకు రిజర్వేషన్ కల్పించాలన్నారు. ఆయా డిమాండ్లపై ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద రెండు రోజులు ధర్నా చేపడతామని, అందులో బిసిలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు లక్ష్మీ మహేష్ గౌడ్, నాగేంద్రబాబు, ఎపి బిసి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు వడ్డే అశోక్‌కుమార్, మహిళా అధ్యక్షురాలు నాగమణి, కురుబ భారతి, నాయీబ్రాహ్మణుల సంఘం ప్రధాన కార్యదర్శి నాగేంద్ర, నక్కలపల్లి శ్రీరామ్‌రెడ్డి, నాగభూషణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న వైస్ ఛైర్మన బలరామిరెడ్డి, కమిషనర్, తదితరులు

ప్రజల పక్షాన 'ప్రజాశక్తి'

ప్రత్యేక సంచిక ఆవిష్కరణలో వైస్ ఛైర్మన్ బలరామిరెడ్డి

ప్రజాశక్తి-హిందూపురం

ప్రజా సమస్యలను అనునిత్యం వెలికితీస్తూ కష్టజీవుల కష్టాల గురించి నిజాయితీగా, నిర్భయంగా వార్తలను ప్రచురించే సామర్థ్యం ప్రజాశక్తికి మాత్రమే ఉందని మున్సిపల్ వైస్‌ఛైర్మన్ బలరామిరెడ్డి, కమిషనర్ ప్రమోద్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్‌లో గురువారం ప్రజాశక్తి 43వ వార్షికోత్సవ ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం వున్న పోటీ ప్రపంచంలో కార్పొరేట్ పత్రికలకు పోటీగా ప్రజాశక్తి పత్రిక నిలుస్తూ కార్మిక కర్షక విద్యార్థి, యువజన బడుగు, బలహీన, మైనార్టీ అన్ని వర్గాల పక్షనా నిలబడి వారి సమస్యలను కథనాల ద్వారా బయటకు తీసుకురావడం అభినందనీయమన్నారు. పత్రికా ప్రచరణలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిజాలను నిర్భయంగా రాయడమే దీనికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మద్దన జయరాములు, మున్సిపల్ ఎంఇ వెంకట రమణ, డిఈఈ బాల సుబ్రమణ్యం, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి-గోరంట్ల రూరల్

ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకుంటూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని ఎఎన్‌కె డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కెంపుల లక్ష్మినారాయణ సూచించారు. మహిళాభివృద్ధి, స్త్రీ శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఎఎన్‌కె డిగ్రీ కళాశాలలో జాతీయ పౌష్టికాహార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నాగరాణి ఆధ్వర్యంలో చిరుధాన్యాలు, పౌష్టికాహార వంటలు, కూరగాయలు, ఆకుకూరలను ప్రదర్శనకు ఉంచారు. ప్రతి ఒక్కరూ చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహారం అలవాటు చేసుకోవాలని, తద్వారా చిరుధాన్యాలను ప్రోత్సహిద్దామని వారు పిలుపునిచ్చారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సూర్యనారాయణ మాట్లాడుతూ చిరుధాన్యాలు మనిషి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని, ప్రతి ఒక్కరూ ఆహారపు అలవాట్లు మార్చుకోవాలన్నారు. నాగరాణి విద్యార్థులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ఎఒ డికె శ్రీనివాసులు, జయప్రకాష్, ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ లక్ష్మినారాయణ

'శ్రీరామిరెడ్డి' స్కీంలో కొల్లగొట్టిన సొమ్మును రికవరీ చేయాలి

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

ప్రజాశక్తి-హిందూపురం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో నీలకంఠాపురం శ్రీరామిరెడ్డి వాటర్ సప్లయి స్కీమ్ ద్వారా గుత్తేదారులు బోగస్ పేర్లతో కొల్లగొట్టిన రూ. 3.24 కోట్ల ప్రభుత్వ సొమ్మును రికవరీ చేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సంపు వద్ద కార్మికులతో సమావేశం నిర్వహించారు. అనంతరం పట్టు గూళ్ల మార్కెట్ వద్ద నీటి మీటర్లు బిగించరాదని జరుగుతున్న సమ్మెకు రైతులు, కూలీలు, ఉద్యోగులు, కార్మికులు, వత్తిదారులు, ప్రజలందరు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు మాట్లాడుతు నీలకంఠాపురం శ్రీరామిరెడ్డి వాటర్ సప్లయి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని నీటి మీటర్లు బిగించరాదని డిమాండ్ చేశారు. కార్మికుల వేతనాల నుంచి కోత విధించిన డబ్బును తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేస్తు గత నెల నుంచి ఆందోళన చేస్తున్న పాలకుల్లో, అధికారల్లో కనీస చలనం లేదన్నారు. దీంతో పాటు గుత్తేదారులు 120 మంది బోగస్ వ్యక్తుల పేర్లతో వేతనాలు ఇచ్చినట్లు ప్రభుత్వ నిధులతో దండుకున్నారని, దీనిని రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్, జిల్లా అధ్యక్షులు జడ్పి శ్రీనివాసులు, సదాశివరెడ్డి, పట్టణ కార్యదర్శి పి.నరసింహప్ప, శ్రీరామిరెడ్డి వాటర్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు ఎస్.లక్ష్మీనారాయణ, నాయకులు సోమశేఖర్, రామాంజనేయులు, మంజు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

రైతులకు అవగాహన

గుడిబండ : మండల పరిధిలోని మద్దనకుంట, కురబరపల్లి, కెరె పాలెం, ముత్తుకూరు గ్రామాల్లో రైతులకు గురువారం కర్బన మదనం కార్యక్రమంపై అవగాహన కల్పించినట్లు ఫీల్డ్ సూపర్‌వైజర్ రమేష్ తెలిపారు. ఆర్‌డిటి ఎఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ డాక్టర్ మల్లారెడ్డి ఆదేశాల మేరకు రైతులకు ఉచితంగా విత్తనాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. 2018 నుంచి మామిడి, చింత నేరేడు, జామ, సపోట, ఉసిరి, చీనీ పండ్ల మొక్కలు నాటిన రైతులకు ఆర్‌డిటి ఎఎఫ్ ఎకాలజీ, రాబో బ్యాంక్ నెదర్లాండ్ వారు సంయుక్తంగా 20 ఏళ్ల వరకూ ఆగ్రో ఫారెస్ట్ కలిగిన రైతులకు అదనపు ఆదాయం అందిస్తారని వివరించారు. కార్యక్రమంలో ముత్తుకూరు సర్పంచి జగదాంబ కృష్ణప్ప, కౌన్సిల్ మెంబర్ కృష్ణప్ప, శివకుమార్, పుట్ట రాజు, ఉమేష్, రైతులు పాల్గొన్నారు.

రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఫీల్డ్ సూపర్‌వైజర్ రమేష్

కేశవమూర్తి కుటుంబానికి రఘువీరా పరామర్శ

ప్రజాశక్తి-అమరాపురం

మండల పరిధిలోని వలస గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వలస కేశవమూర్తి ఇటీవల గుండెపోటుతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న సిడబ్ల్యుసి సభ్యులు, మాజీ మంత్రి ఎన్.రఘువీ రారెడ్డి గురువారం సాయంత్రం వలస గ్రామం వెళ్లి కేశవమూర్తి చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే సుధాకర్, మండల కన్వీనర్ గురుమూర్తి, పి.సిద్దేశ్వర, విశ్వనాథ్, శ్రీనివాసులు, రంగారెడ్డి, వేమరాజ్, ఈరన్న, తిప్పేస్వామి, రంగనాథ్, బసవరాజు, నాగభూషణ్, సర్పంచి శంకర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ బీమా తక్షణ సాయం అందజేత

లేపాక్షి : లేపాక్షి గ్రామపంచాయతీ పరిధిలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన నాగరాజు కుటుంబానికి గురువారం వైఎస్ఆర్ బీమా తక్షణ సాయం కింద రూ. 10వేలు అందజేశారు. ఆ మొత్తాన్ని నాగరాజు భార్య బోయ ఆదెమ్మకి సర్పంచి ఆదినారాయణ అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ విజయ్‌మారుతి, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ మంజుల, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

కదిరి అర్బన్ : మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి పంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపిడిఒ అంజినప్ప గురువారం పరిశీలించారు. గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా లబ్ధిపొందిన రైతు ఆదినారాయణ సాగు చేసిన పండ్ల తోటను సందర్శించారు. ఆదినారాయణని ఆదర్శంగా తీసుకొని ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం అధికారి శ్రీధర్ రెడ్డి,ప్లాంటేషన్ సూపర్‌వైజర్ రవికుమార్ రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ బ్రహ్మానంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

కొత్తచెరువు :కొత్తచెరువులోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో మండల స్థాయి క్రీడా పోటీలను శుక్రవారం ప్రారంభిస్తున్నట్లు శ్రీ సత్య సాయి జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం నాయకులు వెంకటేష్ తెలిపారు. అండర్ – 14 బాలుర, బాలికల, అండర్ – 17 బాలుర, బాలికలకు వివిధ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్, త్రోబాల్, యోగా, టెన్నిస్, షటిల్ బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్‌లలో బాల బాలికలకు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

మెరుగైన విద్యనందించాలి

కదిరి అర్బన్ : మండలంలోని కదిరి బ్రాహ్మణపల్లి పంచాయతీ పరిధిలోని దిన్నెమీదపల్లిగ్రామంలోని పాఠశాలను మండల అభివృద్ధి అధికారి అంజనప్ప గురువారం తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, వారి ప్రగతి గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు.

ముగిసిన మండల స్థాయి క్రీడా పోటీలు

ఓబుళదేవరచెరువు : మండల ఎస్‌జిఎఫ్ మీట్‌లో భాగంగా బాలికలకు వాలీబాల్, కబడ్డీ, ఖో ఖో, త్రో బాల్, బాడ్మింటన్, టెన్నికోట్, యోగ, అథ్లెటిక్స్‌లో నిర్వహించిన పోటీలు గురువారం ముగిసాయి. ఈ పోటీల్లో ప్రతిభ కనపర్చిన క్రీడాకారులను నియోజకవర్గ స్థాయికి ఎంపిక చేశారు. క్రీడాపోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులు గా పాఠశాల ప్రధానో పాధ్యాయులు శోభారాణి, ఎంఇఒలు సురేష్ బాబు, రమణ హాజరై ప్రతిభ కనపరచిన క్రీడా కారులకు సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పీడీలు దానమయ్య, రాంబాబు, జనార్దన్, లలితమ్మ, బేబీ, ఎస్‌జిఎఫ్ మండల ఆర్గనైజర్ జడ్‌పిహెచ్‌ఎస్ పీడీ గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పొలంబడి కిట్లు పంపిణీ

ముదిగుబ్బ : మండలంలోని రామస్వామి తండా క్లస్టర్ పరిధిలో పొలంబడి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రమణా రెడ్డి , డిఆర్‌సి ఎడిఎ సత్యనారాయణ, ఎఒ లక్ష్మీనరసింహులు, సర్పంచ్ మినీ బాయ్, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు. పొలంబడి ప్లాట్ లలో అమర్చిన లింగాకర్షక బుట్టలు, పక్షి స్థావరాలు, సాగుచేసిన కంచెపంట, ఎర పంటలను, వేరుశనగ పంటను పరిశీలించారు. అనంతరం పొలంబడి రైతులకు పొలంబడి కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, పొలంబడి రైతులు పాల్గొన్నారు.

17న గుండె వైద్యశిబిరం

ధర్మవరం టౌన్ : ధర్మవరానికి చెందిన ఆత్మీయట్రస్టు ఆధ్వర్యంలో ఈనెల 17నకాకతీయ విద్యానికేతన్ పాఠశాలలో గుండెవైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు ట్రస్టు చైర్మన్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. ఈ వైద్యశిబిరానికి సంబంధించిన పోస్టర్లను గురువారం స్థానిక పోలీస్ స్టేషన్ లో సిఐ సుబ్రమణ్యం చేతులమీదుగా విడుదల చేయించారు. 2డీ ఎకో, ఈసీజీ, బ్లడ్ షుగర్, బీపీ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తామన్నారు. ఈకార్యక్రమంలో సభ్యులు కేశగాల్ల రంజిత్‌కుమార్, వాయల్పాడుహిదయతుల్లా, జయరాఘవ, సాకే రవికుమార్, అన్నం మల్లికార్జున, జింకాగిరి, రామ్మోహన్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

బుక్కపట్నం : అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రజా సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ శ్రీధర్ రెడ్డి, మేజర్ పంచాయతీ సర్పంచి నాగలక్ష్మి రాజు తెలిపారు. గురువారం మండలంలో నూతనంగా మంజూరైన 313 పింఛన్లను వారు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీలత గోవర్ధన్ రెడ్డి, గసగవారిపల్లి సర్పంచి గోవిందరెడ్డి, వైస్ ఎంపీపీ పార్వతి, నాయకులు పతాంజలి, జయచంద్రారెడ్డి, వీరప్ప తదితరులు పాల్గొన్నారు.

పంటనమోదు తప్పనిసరి

నంబులపూలకుంట : మండల పరిధిలో పంటసాగు చేసిన రైతులు పంటనమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని ఎఒ లోకేశ్వరరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన మండలంలోని ఎదురుదోన, మేకల చెరువు గ్రామాలలో జరుగుతున్న ఈ పంట నమోదును పరిశీలించారు.

రాత్రికి రాత్రే ప్రభుత్వ భూమి కబ్జా

కదిరి టౌన్ : రూరల్ మండలం మొటుకుపల్లి పంచాయతీ కౌలేపల్లి పొలం ప్రభుత్వభూమిలో వైసిపి కి చెందిన ద్వితీయ శ్రేణి నాయకులు కబ్జాచేశారు. రాత్రికి రాత్రే పునాదులు తీసి నిర్మాణాలు చేపట్టారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోవటం లేదన్న విమర్శలు వినపడుతున్నాయి, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కబ్జాకు గురైన భూమిని స్వాధీనం చేసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

సైబర్ నేరాలతో ప్రజలు బెంబేలు

ప్రజాశక్తి - బుక్కపట్నం

సైబర్ నేరాలపై మండల ప్రజలు బెంబేలెత్తుతున్నారు. మండల పరిధిలో గత కొన్ని రోజులుగా ఖాతాదారుల అకౌంట్ నుంచి ఉన్నపలంగా నగదు ఖాళీ అవుతున్నడంతో ఖాతాదారులు ఆందోళనకు గురవుతున్నారు. ఎటువంటి లావాదేవీలు జరపకుండానే నగదు ఖాళీ అయిపోతున్నడంతో ఎవరికి చెప్పాలో తెలియక అయోమయానికి గురవుతున్నారు. గత నెల రోజుల నుంచి స్థానిక స్టేట్ బ్యాంక్ ఖాతాదారుల్లో దాదాపు పదిమంది ఖాతాదారుల నుంచి నగదు ఖాళీ అవుతుండడంతో కొందరు బ్యాంక్ అధికారులను సంప్రదించారు. ఎక్కడైనా వివిధ కారణాల చేత వేలిముద్రలు వేసినప్పుడు జాగ్రత్త వహించాలని వేలిముద్రలు వేసిన కొద్దిరోజుల తర్వాత అకౌంట్ నుంచి అమౌంటు ఉన్నపలంగా ఖాళీ అవుతుంటే అకౌంటు సైబర్ నేరానికి గురైందని గ్రహించి వెంటనే సంబంధిత బ్యాంకు నందు సంప్రదించాలని బ్యాంకర్లు సూచిస్తున్నారు. ఆధార్ కార్డు వివరాలు డిలిమినేషన్ చేసుకోవాలన్నారు. ఖాతాదారుల నుంచి లిఖితపూర్వకంగా వివరాలు తీసుకొని పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సైబర్ క్రైమ్ కు గురి అయ్యుంటే మూడు నెలల లోపు నగదును ఖాతాదారుల అకౌంట్లోకి జమ అయ్యే విధంగా చర్యలు చేపడతామని తెలిపారు. గ్రామానికి చెందిన సంజీవ రాయుడు అనే వ్యక్తికి స్టేట్ బ్యాంక్ నందు అకౌంట్ ఉండగా అతనిఅకౌంట్ నుంచి 12వ తేదీ న పదివేల రూపాయలు, 13వ తేదీన 10 వేల రూపాయలు ఉన్నపలంగా విత్‌డ్రా అయింది. దీంతో బ్యాంక్ అధికారులు సంప్రదించగా అకౌంటు సైబర్ నేరానికి గురైందని తెలిపి ఆధార్ కార్డు డిలిమినేషన్ చేసుకోవాలని సూచించారు. ఈసందర్భంగా స్టేట్‌బ్యాంకు అధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ ఖాతాదారులు ఎక్కడైనా వేలిముద్రలు వేసిన తరువాత అకౌంట్ నుంచి నగదు ఖాళీ అయినచో వెంటనే బ్యాంకును సంప్రదించి తమ ఆధార్ కార్డును డిలిమినేషన్ చేసుకోవాలని సూచించారు.

సైబర్ నేరాల పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఉన్నఫలంగా నగదు ఖాళీ అయితే ఖాతాదారుల నుంచి లిఖితపూర్వకంగా రాయించుకొని పై అధికారులకు సమాచారం అందించి మూడు నెలల లోపు నగదును జమ చేయడం జరుగుతుందని తెలిపారు.

25న కలెక్టరేట్ ముట్టడి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

మాదిగల సమస్యలపై ఈనెల 25న నిర్వహించే కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమానికి తరలిరావాలని ఎమ్మార్పీఎస్ సత్యసాయిజిల్లా ఉపాధ్యక్షులు రేగాటిపల్లి వరదరాజులు పిలుపు నిచ్చారు. దండోరా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు ప్రకాశ్, కెఎస్ బాబు నాయకత్వంలో జరిగే ముట్టడి కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికలను కళాజ్యోతి సర్కిల్లో గురువారం విడుదల చేశారు. దళిత వాడల్లో వీధిలైట్లు, సీసీరోడ్లు, డ్రైనేజీలు, నీటి సమస్యలతో దళితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రధానంగా భూపంపిణీ విషయంలో దళితుల పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పిం చాలని డిమాండ్ చేశారు. ఏపీలో 50లక్షలకు పైగా ఉన్న మాదిగలకు చట్టసభల్లో సమన్యాయం కల్పించి ఏబీసీడీ వర్గీకరణ చేయాలని రాజకీయ ప్రాధాన్యత ఏ పార్టీ ఇస్తుందో ఆ పార్టీకి తమ పూర్తి మద్దతు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు గరుడంపల్లి ఆదినారాయణ, నారాయణస్వామి, దాసప్ప, వసంతపురం మల్లికార్జున, మల్లేనిపపల్లి వీర, నరసింహులు, కుణుతూరు మాజీ సర్పంచి నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా జగనన్న ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి బత్తలపల్లి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీవో సౌజన్యకుమారి ఆదేశించారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాలంటీర్లు, వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేసి జగనన్న ఆరోగ్య సురక్షను విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో తహాశీల్దార్ యుగేశ్వరిదేవి, ఎంఇఒ చాముండేశ్వరి, సచివాలయ ఉద్యోగులు, అంగన్వాడీ వర్కర్లు, వైద్య ఆరోగ్య సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : జగనన్న ఆరోగ్య సురక్షపై అంగనవాడీ, ఆశా కార్యకర్తలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎంపీడీవో రామనాయక్ మాట్లాడుతూ పోషక విలువలు ఉన్న పదార్థాలను బాలింతలకు, గర్భిణులకు సకాలంలో సక్రమంగా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐఒఆర్‌డి సునీత, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హరీష్ పాఠశాలలో హిందీ దివస్

కదిరి టౌన్ : రూరల్ మండల పరిధిలోని గంగమ్మ మోరి వద్ద గల హరీష్ పాఠశాలలో గురువారం హిందీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఎంఎస్ కిరణ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హిందీ భాషపై పట్టు సాధించాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

మంత్రికి ఘనస్వాగతం

బత్తలపల్లి : రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి బత్తలపల్లిలో వైసిపి నాయకులు ఘనస్వాగతం పలికారు. గురువారం తిరుపతి నుంచి అనంతపురానికి రోడ్డు మార్గాన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వస్తున్న విషయం తెలుసుకున్న ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్ బాబు, డిసిఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఘనస్వాగతం పలికారు.

మాతాశిశు సంరక్షణపై అవగాహన

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మాతా శిశు సంరక్షణ, సీజనల్ వ్యాధులపై పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య వైద్య సిబ్బంది గురువారం ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల పరిధిలోని బత్తలపల్లి, పెడపల్లి గ్రామాల్లో వైద్య సిబ్బంది సందర్శించి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. అంగన వాడీకేంద్రాన్ని సందర్శించి పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు ఇచ్చు పౌష్టికాహారం ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి నగేష్, పిహెచ్‌ఎం లలిత కుమారి, ఆరోగ్య పర్యవేక్షకులు చంద్రకళ, ఎంఎల్‌హెచ్‌పిలు రాధ, సత్యమ్మ, ఆరోగ్య కార్యకర్త సుస్మిత, అంగన్వాడీ కార్యకర్త చెన్నకృష్ణమ్మ, అంజినమ్మ ఆశా కార్యకర్తలు లక్ష్మి దేవి, పద్మావతి, వాణిబాయి తదితరులు పాల్గొన్నారు.

15న ఉద్యోగుల గ్రీవెన్స్

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

జిల్లాలోని ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా ఈనెల 15న కలెక్టరేట్లో గ్రీవెన్స్ ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ అరుణ్ బాబు తెలిపారు. ఈ మేరకు కలెక్టరేట్ నుంచి గురువారం ఒక ప్రకటన విడుదల అయింది. ఉద్యోగులకు ఉన్న సమస్యలపై ఫిర్యాదులు సేకరించడం జరుగుతుందన్నారు. ఉదయం నిర్వహించే ఈ కార్యక్రమంలో సర్వీస్ మేటర్ కు సంబంధించి సమస్యలను పొందుపరిచి సిఎఫ్‌ఎం, ఎస్ఐడితో పాటు ఎంప్లాయిస్ గుర్తింపు నెంబర్‌తో పాల్గొనవచ్చన్నారు. గ్రీవెన్స్‌లో వారి ఫిర్యాదులు స్వీకరించి అవసరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని ఉద్యోగులు వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సోమందేపల్లి : మండల పరిధిలోని నల్లగొండరాయనపల్లి క్రాస్ వద్ద 44వ జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం 7 గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నాగినేనిచెరువు తండాకి చెందిన విజయ్‌కుమార్‌నాయక్ మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. బెంగళూరు వైపు నుంచి వస్తున్న కర్నాటక బస్సు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న విజయ్‌కుమార్‌నాయక్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు హైదరాబాద్‌లో ఓ ప్రయివేట్ సంస్థలో సెక్యూరిటీ గార్డ్‌గా పని చేస్తున్నట్లు సమాచారం. విషయం తెలిసిన వెంటనే ఎస్‌ఐ విజయ్‌కుమార్, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యువకుడు ఆత్మహత్య

గోరంట్ల రూరల్ : మండల పరిధిలోని మల్లెల గ్రామానికి చెందిన గురిబండ ఆదినారాయణ(19) ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆదినారాయణ కొంతకాలంగా మద్యానికి బానిసై నిత్యం కుటుంబ సభ్యులను డబ్బులు అడిగేవాడు. బుధవారం రాత్రి మద్యం మత్తులో ఇంటికి చేరుకున్న అతడు మరోమారు కుటుంబసభ్యులతో గొడవపడ్డాడు. అర్ధరాత్రి అంతా నిద్రిస్తుండగా ఇంటి పైకప్పునకు పంచెతో ఉరి వేసుకున్నాడు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అతడి తండ్రి జి.తిప్పన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సి.సుబ్బరాయుడు తెలిపారు.

వ్యక్తి అరెస్టు

అమరాపురం : మండల పరిధిలోని నిడ్రఘట్ట గ్రామ పొలిమేరలో ఇటీవల కెంకెర గ్రామానికి చెందిన గొర్రెల కాపరి రంగనాథ(45) ఓ రైతు పొలంలో విద్యుదాఘాతంతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ సంఘటనకు సంబంధించి నిందితుడు మాల కృష్ణగిరి విద్యుత్ శాఖ అధికారుల అనుమతి తీసుకోకుండానే మల్బరీ పంట చుట్టూ విద్యుత్ కంచె ఏర్పాటు చేసినట్లు విచారణలో తేలింది. దీంతో పోలీసులు అతడిని అరెస్టు చేసేందుకు గాలింపు చర్యలు చేపట్టారు. ఈక్రమంలో నిందితుడు గురువారం హేమావతి గ్రామంలోని నిడ్రఘట్ట సర్కిల్‌లో బెయిల్ కోసం లాయర్‌ను కలవడానకి వెళ్తున్నట్లు తెలియడంతో పోలీసులు అప్రమత్తమై అరెస్టు చేశారని సిఐ సురేష్‌బాబు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసిన వారిలో ఎస్‌ఐ వెంకటేశులు, పోలీసులు పాల్గొన్నారు.

మల్లమీదపల్లిలో ఘర్షణ

గాడ్లపెంట : మండలంలోని మల్ల మీద పల్లి రోడ్డు వద్ద రెండు వర్గాల మధ్య జరిగిన ఘనటలో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మల్లిఖార్జునరెడ్డి తెలిపారు. కోటూరు కు చెందిన రెడ్డి శేఖర్ మండల కేంద్రానికి చెందిన పామిడి అబ్రార్ భాష ఇద్దరు గురువారం ఘర్షణ పడటంతో రెడ్డి శేఖర్ తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ విషయంపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

లారీ ఢీకొని మహారాష్ట్ర వాసి మృతి

లేపాక్షి : మండల పరిధిలోని కల్లూరు గ్రామం వద్ద జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సందీప్(35) మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మహారాష్ట్రకు చెందిన సందీప్ జీవనోపాధి కోసం వలస వచ్చి పరిగి మండలం శాసనకోట గ్రామం వద్ద కూలీ పనులకు వెళ్లే వాడు. గురువారం ద్విచక్ర వాహనంపై లేపాక్షి ఆలయానికి వస్తుండగా మార్గమధ్యలో లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని అతడిని హిందూపురం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

కదిరి అర్బన్ : ప్రభుత్వ ఆసుపత్రిలో గుర్తు తెలియని వ్యక్తి గురువారం మృతి చెందాడు. స్థానిక పోలీసులు పవనిల్ యువసేనకు సమాచారం అందివ్వడంతో వారు మృత దేహానికి సాంప్రదాయ పద్ధతిలో దహన సంస్కారాలు చేశారు. అభిజ్ఞ ఫౌండేషన్ సభ్యుడుఅలీ, వారి మిత్ర బృందంతో ఈ కార్యక్రమాన్ని పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఖాజా మైనుద్దీన్, షాదాబ్ నూర్, షేక్ అల్లా బకాష్, సయ్యద్ ఇమ్రాన్, రంగా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం జరిగే వరకూ పోరాటం

నిరసన దీక్షలో పరిటాల శ్రీరామ్, తదితరులు

నిరసన దీక్షలో మాట్లాడుతున్న కందికుంట

నిరసన దీక్షలో మాట్లాడుతున్న పల్లె రఘునాథరెడ్డి

ప్రజాశక్తి -బత్తలపల్లి

టిడిపి అధినేత చంద్రబాబు కోసం తాము నిరసనలు చేస్తుంటే పోలీసులు లాఠీ ఛార్జ్ చేస్తున్నారని, బాబు కోసం అవసరమైతే నిరాహారదీక్షలే కాదు ప్రాణ త్యాగానికైనా సిద్ధమని టిడిపి ధర్మవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. బాబు తోనే నేను కార్యక్రమంలో భాగంగా బత్తలపల్లిలో టిడిపి నాయకులు చేపట్టిన నిరసన కార్యక్రమంలో పరిటాల శ్రీరామ్ పాల్గొన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిలకం మధుసూదన్ రెడ్డి, స్థానిక సిపిఐ నాయకులు కాటమయ్య, వెంకటేష్ , కురుబ సంఘం, వాల్మీకి సంఘం, మహిళలు ఈ నిరసన కార్యక్రమానికి మద్దతు పలికారు. వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఈ నిరసన కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ స్కిల్ డెవలప్మెంట్ లో చంద్రబాబు ఎలాంటి తప్పిదం చేయలేదన్నారు. ఎంతోమంది నిరుద్యోగులకు వత్తి, విద్య శిక్షణలు ఇచ్చి ఎంతోమంది నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తే ఈ సైకో ప్రభుత్వం అక్రమంగా కేసులు పెట్టిందని విమర్శించారు.రిలే నిరాహార దీక్షలో మండల కన్వీనర్ గోనుగుంట్ల నారాయణరెడ్డి, కుమ్మర శాలి వాహన సాధికారిక కన్వీనర్ మదనపు పొతలయ్య, నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షుడు చల్ల శ్రీనివాసులు, సులేమాన్, బాసికొండ రవీంద్ర, నాగార్జున రెడ్డి, ఆంజనేయులు, నాగభూషణ, డేరంగుల ప్రతాప్, పురుషోత్తం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : ప్రతిపక్షాల గొంతునొక్కేందుకే వైసీపీ ప్రభుత్వం అక్రమం గా కేసులు బనాయించడం, అరెస్టులు చేయడం వంటి దుశ్చర్యలకు పాల్పడుతోందని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగుమధు పేర్కొన్నారు. చంద్రబాబునాయుడి అక్రమ అరెస్టును నిరసిస్తూ నాయకులు పట్టణంలో ర్యాలీ చేపట్టి అనంతరం కళాజ్యోతి సర్కిల్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ ప్రతిపక్షాల గొంతునొక్కేందుకే వైసీపీ ప్రభుత్వం అక్రమంగా కేసులు బనాయించడం, అరెస్టులు చేయడం వంటి దుశ్చర్యలకు పాల్పడుతోందని అన్నారు. రాజకీయ లబ్ధికోసం, ఎన్నికల కోసం ఇలాంటివి చేయడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ చేనేత కార్మికసంఘం తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటస్వామి, వెంకటనారాయణ, సీపీఐ పట్టణ కార్యదర్శి రవికుమార్, సహాయకార్యదర్శి వై.రమణ, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యకులు సకలరాజా తదితరులు పాల్గొన్నారు.

తలుపుల : చంద్రబాబు అరెస్టు అక్రమమని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ విమర్శించారు. ఈ మేరకు టిడిపి నాయకులు స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు గురువారం రిలే దీక్షలు చేపట్టారు, వీరికి మద్దతుగా తలుపుల మండలం సిపిఐ సిపిఎం నాయకులు రిలే దీక్షలో పాల్గొన్నారు ఈసందర్భంగా కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ రాజకీయంగా ఎదుర్కోలేక ప్రతిపక్ష నాయకులపై అన్యాయంగా అక్రమ కేసులు పెట్టి వారిని ఇబ్బంది పెడుతున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అని అన్నారు. రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని విమర్శించారు. రాబోవు రోజుల్లో జగన్‌కు ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు పర్వీన్ భాను, మనోహర్ నాయుడు, ఓబుల్ రెడ్డి, రాజశేఖర్, ముబారక్ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : జగన్ ప్రభుత్వం అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో గట్టిగా బుద్ధి చెబుతారని టిడిపి జిల్లా అధ్యక్షులు బికె పార్థసారథి తెలిపారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు చేపట్టిన సామూహిక రిలే నిరాహార దీక్షలు గురువారం కొనసాగాయి. దీక్షకు మాజీ మంత్రి పరిటాల సునీత, నాయకులు రామకృష్ణప్ప, కురుబ కృష్ణమూర్తి, రొద్దం నరసింహులు, జివిపి నాయుడు, చిన్నప్పయ్య, మాధవనాయుడు, సుబ్బరత్నమ్మ, తదితరులు సంఘీభావం తెలిపారు. పార్థసారథి మాట్లాడుతూ చంద్రబాబు అక్రమ అరెస్టును మేధావులు, రాజకీయ ప్రముఖులు, ప్రజలు, ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో ఖండిస్తున్నారన్నారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నగరాల్లో ఐటి ఉద్యోగులు చంద్రబాబుకి సంఘీభావం తెలుపుతున్నారన్నారు. వీరి దీక్షకు జనసేన, జైభీమ్ భారత్ పార్టీలు సంఘీభావం తెలిపాయి. దీక్షలో నాయకులు రఘువీర, శ్రీనివాసులు, బోయ నాగరాజు, రామలింగ, హుజూర్, అనసూయమ్మ, లీలావతి, గాయిత్రి, హరీష్, ఆదిశేషు, వేణు, రొద్దం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కనగానపల్లి : రాష్ట్రం ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న సమయంలో జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ టిడిపితో కలిసి వస్తానని చెప్పడం మంచి పరిణామం అని పరిటాల సునీత పేర్కొన్నారు. నియోజకవర్గంలో జనసేనతో కలిసి పని చేస్తామన్నారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ చేపట్టిన రిలే నిరహార దీక్షలు కొనసాగా యి. గురువారం దీక్షలో పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పాల్గొన్నారు. పరిటాల సునీత మాట్లాడుతూ స్థానిక ఎస్ఐ కార్యకర్తలపై ఇష్టానుసారం అక్రమకేసులు పెట్టారని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి ఆరోపణలపై స్పందిస్తూ తనపై సిఐడితో కాకపోతే సిబిఐతో విచారణ చేయించుకోమని సవాల్ విసిరారు. టిడిపి అధికారంలోకి రాగానే ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి అక్రమాలను వెలుగులోకి తెస్తామన్నారు. పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ చంద్రబాబు జైలు నుంచి విడుదల అయ్యే వరకూ పోరాటం కొనసాగుతుంద న్నారు. స్కిల్ డెవలవ్‌మెంట్‌లో స్కాం జరగలేదని, ఇది వైసిపి సృష్టించిన కట్టు కథ అన్నారు.

గోరంట్ల : టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ గురువారం మాజీ ఎంపి నిమ్మల కిష్టప్ప ఆధ్వ ర్యంలో స్థానిక చంద్రశేఖర్ థియేటర్ సమీపంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. నిమ్మల కిష్టప్ప మాట్లాడుతూ టిడిపి హయాంలో ఎన్నడూ ప్రతిపక్షాలపై అక్రమ కేసులు, దౌర్జన్యాలకు పాల్పడలేదన్నారు. వైసిపి అధికారం చేపట్టినప్పటి నుంచి ప్రతిపక్ష నేత చంద్రబాబు, టిడిపి సానుభూతిపరులపై అక్రమ కేసులు బనాయిస్తూ రాష్ట్రాభివృద్ధిని గాలికి వదిలేశారన్నారు. ఆదర్శ విద్యాసంస్థల అధినేత సుబ్రహ్మణ్యం, రాష్ట్ర కార్యనిర్వా హక కార్యదర్శి సవితమ్మ, ఒడిసి, బుక్కపట్నం మండలాల కార్యకర్తలు దీక్షలకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సుబ్రహ్మణ్యం, ఎల్‌ఎన్ నారాయణస్వామి, బాలకృష్ణచౌదరి, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : టిడిపి శ్రేణులపై జరిగిన దమనకాండ, సిఎం జగన్ కక్షపూరిత రాజకీయాలకు నిరసనగా మాజీ ఎమ్మెల్సీ, నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో పట్టణంలోని అన్న క్యాంటీన్ దగ్గర రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా గుండుమల మాట్లాడుతూ చంద్రబాబు రిమాండ్ నుంచి కడిగిన ఆణిముత్యంలా బయటకు వస్తారని, ఎవరూ అధైర్యపడొద్దని సూచించారు. టిఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మురళిబాబు, సిపిఎం, సిపిఐ, రైతు, జైభీమ్ సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. దీక్షలో మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, మనోహర్, భక్తర్‌సాబ్, తిమ్మరాజు, శంకర్, కృష్ణమూర్తి, రామాంజనేయులు, కట్టా కిషోర్, రవికుమార్, కళ్ళుమరి నాగరాజు, గౌడనహళ్లి నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

అమరాపురం : చంద్రబాబు త్వరగా జైలు నుంచి విడుదల కావాలని, ఆయన సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని కాంక్షిస్తూ మండల పరిధిలోని ప్రసిద్ధ హేమావతి సిద్దేశ్వరస్వామి ఆలయంలో టిడిపి మండల కన్వీనర్ గణేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపించారు. స్వామి వారికి 101 టెంకాయలు సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్ : తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడుకు ఆత్మస్థైర్యం నింపడమే మనందరి బాధ్యతని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు అరెస్టు నిరసనగా శ్రీ సత్య సాయి జిల్లా ఆర్డీవో కార్యాలయం ముందు టిడిపి ఆధ్వర్యంలో నిర్వహిస్తు రెండవ రోజు నిరసన దీక్షకు పుట్టపర్తి నాయకులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. గురువారం నిర్వహించిన దీక్షలకు పుట్టపర్తి మండలానికి చెందిన తెలుగుదేశం నాయకులు రామప్ప నాయుడు, పుల్లప్ప, ఎల్ఐసి నరసింహులు, శ్రీరామ్ రెడ్డి, జయ ప్రకాష్, మాజీ జెడ్పీటీసీ చెన్నకేశవులు, మండల కన్వీనర్లు రామాంజనేయులు, విజయకుమార్, ఆదినారాయణ రెడ్డి, శ్రీరామ్ నాయక్ తదితరులతో పాటు వందలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు. అదేవిధంగా జనసేన అబ్దుల్లా, రాము, తిరుపతేంద్ర తదితర నాయకులు దీక్షలకు మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడి అరెస్టు అక్రమమని అన్నారు. చంద్రబాబు చేపట్టిన వివిధ కార్యక్రమాలకు రాష్ట్ర ప్రజలు బ్రహ్మరథం పట్టిన విషయాన్ని జీర్ణించుకోలేక వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఒక పద్ధతి ప్రకారం స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో ఇరికించారని విమర్శించారు. జగన్‌కు వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. పస లేని కేసులు పెట్టి, చంద్ర బాబు ని ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గూడూరు ఓబులేసు, సామకోటి ఆదినారాయణ, అంబులెన్స్ రమేష్ , బొమ్మయ్య, కొట్లపల్లి జగన్, నాగిరెడ్డి, రామయ్య, వెంకట గారి పల్లి, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : చంద్రబాబు నాయుడుకు బెయిల్ వచ్చే వరకు తమ ఉద్యమాలు కొనసాగుతాయని మాజీ ఎమ్మెల్యే, సీనియర్ టిడిపి నాయకులు సిసి వెంకట్రాముడు అన్నారు. గురువారం పట్టణంలోని ఇందిరమ్మ సర్కిల్‌లో టిడిపి నాయకులు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సిసి వెంకట్రాముడు, అంబికా లక్ష్మినారాయణ, శ్రీనివాస రావు, అంజినప్ప మాట్లాడుతు చంద్రబాబును కక్షతోనే జైలుకు పంపించారని ఇటువంటి ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్ కుమార్, గంగాధర్, చిన్నా రెడ్డి, రామాంజినమ్మ, జెపికె రాము, నెట్టప్ప, పరిమళ, రాము, దాదు, హిదయతుల్లా, కౌన్సిలర్లు మంజుళ, మహాలక్ష్మి, పెద్ద ఎత్తున టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ధర్మవరంటౌన్ : టీడీపీ అధినేత నారాచంద్రబాబునాయుడు కోసం లాఠీదెబ్బలేకాదు ప్రాణత్యాగానికైన సిద్దమని నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. బాబుతోనే నేను కార్యక్రమంలో భాగంగా రోజు గురువారం చేపట్టిన రిలే నిరాహారదీక్షలో తెలుగుమహిళలు పాల్గొన్నారు. దీక్షలో పాల్గొన్న మహిళలకు పరిటాల శ్రీరామ్ తోపాటు జనసేన పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకంమధుసూదన్‌రెడ్డి, సీపీఐ నాయకులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ సిల్ డెవలప్‌మెంట్‌లో చంద్రబాబు ఎలాంటి తప్పు చేయలేదన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా ధర్మవరంలో శాంతియుత నిరసన చేస్తుంటే పోలీసులు లాఠీచార్జ్ చేశారని, దీంతో అనేక మందికి గాయాలయ్యాయని అన్నారు. అయినప్పటికీ వెనక్కితగ్గేదిలేదన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు కమతంకాటమయ్య, ఫణికుమార్, పురుషోత్తంగౌడ్, చింతపులుసు పెద్దన్న, భీమనేని ప్రసాద్‌నాయుడు, గరుగు వెంగప్ప, పరిశేసుధాకర్, నాగూరుస్సేన్, రాళ్లపల్లి షరీఫ్, కేశగాళ్ల శీన, రాంపురంశీన, గంగారపు రవి. బొట్టుకిష్ట, గోసలశ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.